ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నరసాపురం

లక్ష్మణేశ్వరం గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేపడుతున్న పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు అనేక సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో చేపడుతున్న పనుల వివరాలను, పనులకు హాజరైన వారి వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి తిరుమాని వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



వంటింట్లో మోడీ మంట..!

గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచిన కేంద్రం

నేటి నుంచి అమలు

45 రోజులకు ఒక సిలిండర్ వాడితే ఉమ్మడి జిల్లా వినియోగదారులపై ఏడాదికి రూ.32 కోట్ల భారం

బిజెపి ప్రభుత్వం తీరుపై జనం రుసరుసలు

ప్రజాశక్తి - భీమవరం

మొన్నటి వరకూ మహిళలు ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఎదురుచూశారు. ఇది అమల్లోకి వచ్చిన కొన్ని రోజుల వ్యవధిలోనే గ్యాస్ సిలిండర్ ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం వంటింట్లో మంట పెట్టినట్లయ్యింది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచుతున్నట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పురీ ప్రకటించారు. ఈ ధరల పెంపు ఉజ్వల పథకం లబ్ధిదారులకు సైతం వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల ఎనిమిదో తేదీ మంగళవారం నుంచి పెంపు అమల్లోకి వస్తుందని ప్రకటించారు. మరోపక్క పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం పెంచింది. ఈ పెంపును ఆయిల్ కంపెనీలకే వర్తిస్తుందని, వినియోగదారులపై పడబోదని తెలిపింది. అయితే ఏదోక సమయంలో వినియోగదారులపై పెట్రో ధరల భారం పడుతుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గత వారంలో వాణిజ్య సిలిండర్ ధరను రూ.41 మేర తగ్గించింది. ఈ నేపథ్యంలో గృహావసరాల వంట గ్యాస్ ధర తగ్గుతుందని అంతా భావిస్తుండగా రూ.50 పెంచడం అందరినీ నిర్ఘాంతపర్చింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు ఎనిమిది లక్షలకుపైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. గృహ వినియోగదారుల గ్యాస్ సిలిండర్ ధర రూ.833, వాణిజ్య సిలిండర్ ధర రూ.1,950 ధరగా ఉంది. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో ఆ భారం వినియోగదారునిపైనే పడుతుందని పరిశీలకులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం కింద ప్రస్తుత మొదటి క్వార్టర్‌లో ఒక సిలిండర్ ఇవ్వాల్సి ఉండగా గతంలో వలె సొమ్ము జమ చేస్తుందని, పెరిగిన సొమ్ము ఇచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. ఈ విధంగా చూస్తే వినియోగదారులపై రూ.50 భారం పడక తప్పదు. సగటున ఒక్కో వినియోగదారుడు 45 రోజులకు ఒక సిలిండర్ వాడితే సంవత్సరం మొత్తంగా ఎనిమిది సిలిండర్లు వినియోగించే అవకాశం ఉంది. అంటే ఒక్కో వినియోగదారునిపై సగటున సంవత్సరానికి రూ.400 చొప్పున భారం పడనుంది. ఉమ్మడి జిల్లాలో వినియోగదారులపై సంవత్సరానికి రూ.32 కోట్లు అదనపు భారం పడుతుంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న వినియోగదారులకు గ్యాస్ ధర పెంపు గోరుచుట్టుపై రోకటిపోటులా పరిణమించిందనే చెప్పొచ్చు. మోడీ సర్కార్ తీరుపై మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

గ్యాస్ సిలిండర్ ధర పెంపు సరికాదు

సాదే నాగరాజు, మోగల్లు, పాలకోడేరు మండలం

ఉచిత గ్యాస్ సిలిండర్ అన్నారు. సబ్సిడీ ఇస్తామన్నారు. ఇది పూర్తిస్థాయిలో అందకుండానే గ్యాస్ ధర పెంచారు. ఇదెక్కడి దారుణం. కేంద్ర ప్రభుత్వం తరచూ గ్యాస్ ధర పెంచడం సరైంది కాదు. ఇప్పటికే పెరిగిన వస్తువుల ధరలతో సతమతమవుతున్నాం. వీటిని తగ్గించాల్సిందిపోయి గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర పెంచడం సమంజసం కాదు. తక్షణం గ్యాస్ సిలిండర్ ధర పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

గ్యాస్ ధర ఎన్నిసార్లు పెంచుతారు..

కె.రామలక్ష్మి, గృహిణి, భీమవరం

గ్యాస్ ధరలు ఇప్పటికే రెండు, మూడుసార్లు పెంచారు. ప్రస్తుతం రూ.833 చెల్లిస్తున్నాం. ఇది చాలదన్నట్టు అదనంగా మరో రూ.50 పెంచడం దారుణం. అసలు గ్యాస్ సిలిండర్ ధర ఎన్నిసార్లు పెంచుతారు. ఇలా పెంచుకుంటూపోతే సామాన్య ప్రజానీకం ఎలా బతుకుతారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం గ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోవాలి.

పుల్లల పొయ్యే గతి..

మేడే నరేష్, ఆటో డ్రైవర్, వీరవాసరం

ఒకపక్క కిరాణా సరుకుల ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ఇప్పటికే విద్యుత్ ఛార్జీల భారం తట్టుకోలేని పరిస్థితి ఉంది. ఇప్పుడు గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణం. ఇది మాలాంటివారికి మోయలేని భారమే. ఇక పుల్లల పొయ్యేగతి.

నొప్పి తెలియకుండా భారాలు మోపుతున్నారు..

గుడాల మీనా, వీరవాసరం

నా భర్త రోజువారీ చేపల వ్యాపారి. ప్రస్తుతం మా వ్యాపారం అంతంత మాత్రమే. ఒక్కో రోజు పెట్టుబడి కూడా రాని పరిస్థితి. అంత కంతకూ గ్యాస్ ధర పెంచుకుంటూపోతూ నొప్పి తెలియకుండా భారాలు మోపుతున్నారు. దీనివల్ల కుటుంబం గడవడం కష్టంగా మారుతోంది. ఇలా అయితే మేం ఎలా బతకాలి.

గ్యాస్ ధర పెంపు పెనుభారమే..

మడకం సుధారాణి, గృహిణి, రామమ్మగూడెం, టి.నర్సాపురం మండలం

గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడం అత్యంత దారుణం. నిత్యావసరాల ధరలు తగ్గించాలని కోరుతుంటే పట్టించుకోని ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో మరోభారం మోపడం అన్యాయం. వెంటనే పెంచిన ధరలు తగ్గించాలి.

సామాన్యులు బతికేదెలా..

ఎం.కుమారి, ఎంఎస్ఆర్ నగర్, టి.నర్సాపురం మండలం

ప్రభుత్వాలు ఇష్టానుసారం ధరలు పెంచుకుంటూ పోతే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎలా బతకాలి. ఇక కట్టెల పొయ్యిలే గతి. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ధరలు పెంచుతుందే తప్ప తగ్గించే ఆలోచన చేయడం లేదు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి.

అర్జీలు పరిష్కరించకుంటే చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్ అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలు మూలలా ప్రజల నుంచి వచ్చిన 279 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతిస్తోందన్నారు. అధికారులు అంతకంటే ఎక్కువ ప్రాధాన్యతివ్వాలన్నారు. ఒక సమస్య పరిష్కరించడమంటే పని భారం తగ్గించుకున్నట్లేనని, సరైన పరిష్కారం చూపకపోతే రెట్టింపు పని భారం పెరుగుతుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ మెంబర్ షిప్‌లను సాధ్యమైనంత ఎక్కువగా చేయడానికి జిల్లా, మండల స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో మెంబర్‌షిప్ చేరికల సంఖ్య చాలా తక్కువగా ఉందని, కొన్ని మండలాల్లో ప్రారంభమే కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీకి అవసరమైన రక్తాన్ని సేకరించేందుకు ప్రతి కార్యాలయంలోని ఉద్యోగస్తుల ద్వారా రక్తదాన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

ఆక్వా రైతుల నిరసన ప్రదర్శన

సమస్యలు పరిష్కరించాలని

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని పూలపల్లి వైజంక్షన్ వద్ద జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండుటెండలో భారీ ఎత్తున ఆక్వారంగ సమస్యలపై రోడ్డుపై బైఠాయించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాలకొల్లు, పోడూరు, యలమంచిలి మండలాల ఆక్వా రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నా జరుగుతుండగా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అయితే ట్రాఫిక్‌లో ఉన్న అంబులెన్స్‌కు రైతులు దారి ఇచ్చి సహకరించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతు సంఘం ప్రెసిడెంట్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ప్రాసెసింగ్ యూనిట్ల వారంతా సిండికేట్‌గా ఏర్పడి కిలోకు రూ.50 నుంచి వంద రూపాయల వరకూ రేటు తగ్గించి ఆక్వా రైతుల నడ్డి విరుస్తున్నారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలను సాకుగా చూపి రేట్లు ఒక్కసారిగా తగ్గించేశారని తెలిపారు. రొయ్యల సాగు చేస్తున్న రైతులకు పంట రేటు నిర్ణయించుకునే హక్కు లేకుండా పోయిందన్నారు. దళారులంతా ఒక్కటై ఈ రకంగా ప్రవర్తిస్తే ఆక్వా రైతు నష్టాల ఊబిలో కూరుకు పోవడమే కాకుండా ఆక్వా చెరువులపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్ల సిండికేట్‌ను ప్రభుత్వం వెంటనే నియంత్రించాలని కోరారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులకు ఆత్మహత్యలు తప్ప వేరే దారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ వరకూ క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పెన్మత్స వెంకట సత్యనారాయణరాజు, సజ్జ వీర వెంకట సత్యనారాయణ, సుధీర్‌రెడ్డి, బోనం వెంకట నరసయ్య, అంగర వరప్రసాద్, మేడిది జాన్‌రాజు, బోనం రంగయ్య నాయుడు, మేక ఫణీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ఆక్వా రైతులు

గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

మోకులతో కల్లు గీత కార్మికుల మోటార్ సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రంలో అక్రమ మద్యం వరదలా పారుతుంటే కూటమి ప్రభుత్వం ఏం చేస్తోందని ఎపి కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి ప్రశ్నించారు. బెల్టుషాపులను అరికట్టాలని, కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని, గీత వృత్తి చేస్తున్న వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గీత కార్మికులు మోకులు ధరించి స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ స్టేషన్ వద్ద వద్ద ధర్నా చేసి అనంతరం ఎక్సైజ్ ఎస్ఐలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 5 వేల వరకూ, రాష్ట్రంలో 70 వేలకు పైగా బెల్ట్ షాపులు రాత్రి, పగలూ రోడ్డు పక్కనే యథేచ్ఛగా అమ్ముతుంటే అరికట్టే ధైర్యం ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి బెల్టు షాపులు నిర్వహిస్తే బెల్ట్ తీస్తామని చేసిన హెచ్చరికలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సీతారామపురంలో ఓ బ్రాందీ షాపులో అర్ధరాత్రి వరకూ మద్యం అమ్ముతుండగా అటుగా వెళ్తున్న తమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆగి ఈ టైం వరకూ ఎందుకు అమ్ముతున్నారని అడిగితే ఆ షాపు వారు తమ నాయకుడుని నిర్బంధించి సెల్‌ఫోన్ లాగేసుకొని మాతో పెట్టుకుంటే సాల్తీ లేపేస్తామని హెచ్చరించారంటే మద్యం సిండికేట్లు ప్రభుత్వాన్నే శాశించే పరిస్థితి వచ్చిందా అన్నారు. బెల్టు షాపులు రద్దు చేయకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. నరసాపురం డివిజన్ కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొక్కా చంటి మాట్లాడుతూ ప్రమాదంలో చనిపోయిన వారికి, వికలాంగులకు తెలంగాణాలో ఇస్తున్నట్లుగా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలన్నారు. సమావేశంలో పెచ్చెట్టి నరసింహారావు, గుబ్బల వెంకన్న, బొక్కా సోమేశ్వరం, గుత్తుల కల్కిమూర్తి, పితాని నాగరాజు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్ఐలకు వినతిపత్రాన్ని అందిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నేతలు

గ్యాస్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

10న భీమవరంలో డెలివరీ బోయ్స్ జిల్లా మహాసభ

హెచ్‌పి గ్యాస్ కంపెనీ వద్ద ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వివిధ గ్యాస్ కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు (గ్యాస్ డెలివరీ బాయ్స్) కనీస వేతనం రూ.26 వేలు అందించి పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భీమవరం హెచ్‌పి గ్యాస్ కంపెనీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. జిల్లాలో వివిధ గ్యాస్ కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయడం లేదన్నారు. కార్మిక శాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గ్యాస్ అమ్మకం ద్వారా కోట్లు గడిస్తున్న గ్యాస్ కంపెనీల యాజమాన్యాలు గ్యాస్ డెలివరీ బాయ్స్ సంక్షేమానికి చర్యలు చేపట్టడం లేదన్నారు. జిల్లాలో గ్యాస్ డెలివరీ ఏజెన్సీలు డెలివరీ బాయ్స్‌పై వేధింపులు మానుకోవాలన్నారు. ప్రస్తుతం గ్యాస్ డెలివరీ బాయ్స్ రూ.5 వేల నుంచి రూ.8 వేలలోపు నెల జీతాలకు పని చేస్తున్నారని పెరుగుతున్న ధరలతో కుటుంబాలతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. జిల్లా అధికారులు గ్యాస్ డెలివరీ బాయ్స్ కనీస వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న గ్యాస్ డెలివరీ బాయ్స్ జిల్లా మహాసభ భీమవరంలో జరుగుతుందని, అనంతరం వినతి పత్రం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. గ్యాస్ వర్కర్స్ అందరూ ఈ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గ్యాస్ కంపెనీ వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - యలమంచిలి

ఉపాధి హామీ కూలీలందరికీ రూ.600 వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, సోమవారం మండలంలోని ఏనుగువానిలంకలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా జార్జి మాట్లాడుతూ ఉపాధి హామీలో పనిచేస్తున్న కుటుంబాలందరికీ సంవత్సరానికి కనీసం 150 రోజులు పని కల్పించాలన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలీ వేతనాన్ని కనీసం రూ.600లకు పెంచితే గానీ పేద కుటుంబాలు గడిచే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కూలీలకు వేతనాలు పెంచి పనిచేసిన వారందరికీ సకాలంలో వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, కానేటి బాలరాజు పాల్గొన్నారు.

ఇరగవరం : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఇరగవరం : చేసిన పనికి కూలి చెల్లించకపోవడంతో ఉపాధి కూలీలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇరగవరం మండలం అర్జునుడుపాలెం గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను నేతలు సోమవారం కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉపాధి హామీ చట్టం పట్ల కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీరు మార్చుకోవాలని లేకుంటే కూలీలు చూస్తూ ఊరుకోరన్నారు. త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నాట్లు, కోతల సమయంలో మినహా ఏడాది పొడవునా ఖాళీగానే ఉండాల్సిన పరిస్థితులు ఉన్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి హామీ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిల్లి అంజలి, గంట శ్రీనివాసు, కర్రి గంగాలక్ష్మి, పొట్ల బాలయ్య, సుందర ఆదినారాయణ, పాలకోడేటి పద్మ, టి.వెంకటేశ్వరరావు, మారంపూడి సంతోషం, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్మశానవాటికల అభివృద్ధికి ప్రాధాన్యత : కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శ్మశానవాటిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్ర పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. సోమవారం స్థానిక మారిశెట్టి ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఏడు నియోజకవర్గాల్లో శ్మశాన వాటికల సమస్య అధికంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణం చేపడతామన్నారు. తాడేపల్లిగూడెం 24వ వార్డులో ఎలక్ట్రికల్ శ్మశానవాటిక ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌కు, అదనపు భవనాలకు రూ.రెండు కోట్లు సిఎస్ఆర్ నిధుల ద్వారా పనులు చేపడతామన్నారు. భీమవరం పిప్పర రోడ్డుకు 100 కోట్లతో పనులు చేపడుతున్నామని, టెండర్లు పిలుస్తామన్నారు. ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలన్నారు. అనంతరం మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఎంఎల్ఎ బొలిశెట్టి, నేతలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వలవల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగిస్తే ఎలా

కలెక్టరేట్ వద్ద సుబ్బరాజు-చెరువు గట్టు ప్రాంత వాసుల ధర్నా

భీమవరం: 90 ఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నాం.. ఉన్నట్టుండి ఇళ్లు తొలగిస్తాం ఖాళీ చేయండి అంటే ఎక్కడికి వెళ్తామంటూ మోగల్లు సుబ్బరాజు చెరువుగట్టు ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంత వాసులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య మాట్లాడారు. నిరుపేదలకు ఇళ్లు కట్టి ఇవ్వాల్సింది పోయి ఉన్న ఇళ్లను తొలగించే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి 23 కుటుంబాలు తినో తినకో ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న వారి ఇళ్లను తొలగిస్తామని చెప్పడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలంలో నివాసముంటున్న పేదలకు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇస్తామని ఇప్పుడు ఖాళీ చేయండని చెప్పడం దారుణం అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు ఇవ్వడంతోపాటు ప్రభుత్వ స్థలంలో నివాసముంటున్న వారికి పట్టాలివ్వాలని, సుబ్బరాజు చెరువు గట్టుమీద ఉంటున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపించిన తర్వాత తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లుకు వినపత్రం అందజేశారు. స్పందించిన డిఆర్ఒ మాట్లాడుతూ సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సిపిఎం నాయకులు గొర్ల రామకృష్ణ, పాల వెంకటస్వామి, శ్రీను, పద్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బాధితులు, సిపిఎం నేతలు

ప్రభుత్వ కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ధర్నా

పెనుగొండ: ప్రభుత్వ కాలనీల్లో తాగునీరు, రోడ్లు, వీధిలైట్లు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ లబ్ధిదారులు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అండగా ఉంటామని కాలనీలు ఏర్పాటు చేసి నాలుగేళ్లయినా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. కాలనీల్లో తాగునీరు, రోడ్లు, విద్యుత్ వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రేషన్, గ్యాస్ సిలిండర్లు కాలనీలకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, మండల అభివృద్ధి శాఖల నుంచి సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్ బి.అనిత కుమారికి, మండల అభివద్ధి అధికారి టి.సూర్యనారాయణ మూర్తికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, లబ్ధిదారులు కె.లోవరాజు, వి.మమత, సునీత, జి.వెంకటేష్, రామలింగం, సాయికుమారి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ బ్రిడ్జిని నిర్మిస్తాం

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

కనకాయలంక, పెదలంకలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - యలమంచిలి

గతంలో తాను ఇచ్చిన హామీ ప్రకారం కనకాయలంక గ్రామంలో ఫుట్‌పాత్ బ్రిడ్జిని నిర్మించి ప్రజల కష్టాలను తీరుస్తానని జల వనుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇప్పటికే రూ.25 కోట్ల ప్రతిపాదనతో ప్రభుత్వానికి నివేదిక పంపించామని తెలిపారు. ఆదివారం రాత్రి కనకాయలంక, పెద్దలంక గ్రామాల్లో కోటి రూపాయలతో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా తాగునీటి పనులకు శంకుస్థాపనలు చేసి, మరో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల పనులను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. తనకు లంక గ్రామాలంటే ఎంతో అభిమానమన్నారు. కేవలం 900 ఓట్లు మాత్రమే ఉన్న కనకాయలంక గ్రామానికి రూ.23 కోట్లతో ఫుట్‌పాత్ బ్రిడ్జిని నిర్మించడానికి కృషి చేస్తున్నామంటే లంక గ్రామాలపై తనకు ఎటువంటి అభిమానం ఉందో అర్థం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కనకాయలంక, పెదలంక సర్పంచులు మద్దా శ్రీనివాసు, తాళ్ల నాగరాజు, ఇన్‌ఛార్జి ఎంపిపి గొల్లపల్లి శ్రీనివాస్, కూటమి నాయకులు మామిడి శెట్టి పెద్దిరాజు, ఉన్నమట్ల ఖబర్ధి, కె.వరబాబు పాల్గొన్నారు.

కోపల్లెలో ఉపాధిహామీ పనులు ప్రారంభం

కాళ్ల : కోపల్లె గ్రామంలోని నగరపేట ప్రాంతంలో చెరువు పూడికతీత పనులు సోమవారం సర్పంచి బూడి నాగమణి సోమవారం ప్రారంభించారు. పూర్తిగా పూడుకుపోయిన పంచాయతీ చెరువును మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో సుమారు రూ.4 లక్షలతో 1,266 పనిదినాల అంచనాతో పనులు చేపట్టినట్టు ఇంజినీరింగ్ కన్సల్టెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి బూడి వెంకటప్పరాజు, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

పెనుగొండ : పెనుగొండ మండల స్థాయి స్టాక్ పాయింట్‌గా వడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేసినట్లు జిల్లా ఇన్‌ఛార్జి డాక్టర్ టిఎండి ఇస్మాయిల్ అన్నారు. సోమవారం మండలంలో పాఠశాలలో స్టాక్ పాయింట్లను జిల్లా అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరం గాను సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్ మండల స్థాయి స్టాక్ పాయింట్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న స్టాక్ పాయింట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఎంఒ వై.చంద్రశేఖర్, ఎంఇఒ-1 సుధాకర్, ఎంఇఒ-2 పి.రామకృష్ణ పాల్గొన్నారు.

మొగల్తూరు : పాఠశాలలో వేసవి సెలవులు అనంతరం తిరిగి ప్రారంభించేసరికి విద్యార్థులకు సామాగ్రి కిట్టులను పంపిణీ చేస్తామని జిల్లా ఇన్‌ఛార్జి టిఎండి ఇస్మాయిల్ తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను భద్రపరిచేందుకు మండల స్టాక్ పాయింట్ పరిశీలన నిమిత్తం అధికార బృందం సోమవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా శేషపారం నివ్వలేటి తాతయ్య నాయుడు పాఠశాల ఆవరణను ఉన్నట్లు గుర్తించి ఎంపిక చేశారు. ఆయన వెంట సిఎంఒ యండమూరి చంద్రశేఖర్, ఎంఇఒ యు.శామ్యూల్, సిఆర్ఎంటి పిబివి పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

గణపవరం : మండలంలో మంగళవారం వరదారాజపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి సోమవారం తెలిపారు. వరదరాజపురం పరిధిలోని వెలగపల్లి, వరదారాజపురం, అర్ధవరం, వల్లూరు, వాకపల్లి, వీరేశ్వరపురం, ముగ్గళ్ల, కొత్తపల్లి గ్రామాల్లో కొత్త లైన్ల ఏర్పాటుకి పాత లైన్ల మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఆక్వారైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

పాలకోడేరు : 33 కెవి నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేండ్ర, వేండ్ర అగ్రహారం, కొండేపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

'వైద్య, విద్య రంగాలకు చీడే సేవలు ఎనలేనివి'

భీమవరం టౌన్ : వైద్య, విద్య రంగాలకు అనేక సేవలందించిన డాక్టర్ చీడే సత్యనారాయణ ఒక వ్యక్తి కాదని, ఒక మహా సంస్థని, ఆయన వందవ పుట్టినరోజు ఘనంగా నిర్వహిస్తామని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో డాక్టర్ చీడే నివాసంలో సిఐఎస్ కళాశాల వ్యవస్థాపకులు సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ 5 దశాబ్దాలుగా వైద్య సేవలో భీమవరంతోపాటు రెండు జిల్లాలు చుట్టుపక్కల ఆయన అందించిన సేవలు ఎనలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, గన్నాబత్తుల శ్రీనివాస్, ఆరేటి ప్రకాష్, చిగురుపల్లి వెంకటరామయ్య, డివిబి.ప్రసాద్, పుప్పాల శేషు, శోభ పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది

ప్రారంభ కార్యక్రమంలో ఎంఎల్ఎ అంజిబాబు

భీమవరం టౌన్ : అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని, ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విశేషమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం వీరమ్మ పార్క్ సెంటర్ శ్రీరాధా సమేత భోగలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి సోమవారం భక్తులకు నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, సుబ్బారావు, నాని, నూకల రాజు, అప్పాజీ, నున్న అంజిబాబు, కరుణ్ కుమార్, మంగేష్ శర్మ పాల్గొన్నారు.

అర్చకునికి సత్కారం

కాళ్ల : గ్రామ ప్రజలంతా ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని రామాలయంలో అర్చకత్వం చేస్తున్న పవన్ మరింత సేవలందించాలని కెవిఎల్ సీ ఫుడ్స్ అధినేత మంతెన నాగలింగేశ్వరరాజు ఆకాంక్షించారు. సోమవారం కోమటిగుంట గ్రామంలోని కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా రామాలయం అర్చకులు పవన్‌ను పూలమాలలతో, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. శ్రీరామనవమి సందర్భంగా గత పది సంవత్సరాలుగా అర్చకునికి కాసు బంగారం ఇవ్వడాన్ని మంతెన నాగలింగేశ్వరరాజును పలువురు అభినందించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి యలమంచిలి వెంకట రమణ, శ్రీనివాస్, గణపతి, పరమేశ్వరరావు, మహంకాళేశ్వరరావు, అంజనేయులు, కాపుల్లి సత్యనారాయణ, పులుమంతుల యేసురాజు, నాగమల్ల నాగేశ్వరావు, గుర్రం మహేష్, సేనబత్తి పాండు రంగారావు, అంజనేయులు, నాగమల్ల గొల్ల అంజనేయులు పాల్గొన్నారు.

నారాయణస్వామి విగ్రహావిష్కరణ

తాడేపల్లిగూడెం : గొప్ప వ్యక్తిత్వం గల మనిషి, చిరస్మరణీయుడు, కీర్తిశేషులు ఎర్రా నారాయణస్వామి అని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. సోమవారం పెద తాడేపల్లి శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో నారాయణస్వామి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతతరం, కొత్త తరం నాయకులకు ఎర్ర సుపరిచితుడు అన్నారు. ఉన్నతమైన ఆలోచనలు ఉన్న వ్యక్తి, విద్యారంగ అభివృద్ధి జరుగుతుందని నమ్మిన వ్యక్తి ఎర్ర అని పేర్కొన్నారు. 2000 సంవత్సరంలో ప్రారంభించబడిన వాసవి ఇంజనీరింగ్ కాలేజ్ నేడు దినదినాభివృద్ధి చెంది ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం ప్రభుత్వ విప్, తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, బిజెపి కన్వీనర్ తతకోట తాతాజీ, పెదతాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం, మాజీ ఎంఎల్ఎ పసల కనక సుందరరావు, యర్రా నారాయణ స్వామి కుమారుడు యర్రా నవీన్ పాల్గొని కేంద్ర మంత్రిని సత్కరించారు.

వెంకటేష్‌కు ఘన నివాళులు

ఉండి: ఉండిలో అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ రిపోర్టర్ అకుల వెంకట్ మృతికి ఉండి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో డిసిసిబి మాజీ చైర్మన్ పివిఎల్ నరసింహరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్, ప్రముఖ పారిశ్రామికవేత్త దాట్లపల్లి నారాయణరెడ్డి పాల్గొని ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ రిపోర్టర్ అకుల వెంకట్ మృతి ఉండి ప్రెస్ క్లబ్‌కు తీరని లోటు అని మీడియా రంగంలో వెంకట్ తనదైన ముద్ర వేశారని అన్నారు. వెంకట్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు.

స్కాలర్ షిప్‌లు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

విద్యార్థులకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

పాలకొల్లు : పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన వసుధ ఫౌండేషన్ ఆర్థిక వితరణ కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి డాక్టర్ బోనం రాధాకృష్ణ భగవాన్ రాజా అధ్యక్షత వహించారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు చెరుకూరి శ్రీరామరాజు చేతుల మీదుగా రూ.లక్ష పదివేల ఆర్థిక సహకారాన్ని 13 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు అందించారు. ఒక మెడిసిన్ విద్యార్థి, ఒక క్యాన్సర్ పేషెంట్, ఒక కిడ్నీ పేషెంట్‌కు కలిపి మొత్తం ఈ సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ రాజు మాట్లాడుతూ వసుధ ఫౌండేషన్ చైర్మన్ వెంకట రామరాజు ఎంతో మంది పేదలకు వైద్యానికి, విద్యకు తమ ట్రస్టు ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని ఆ స్ఫూర్తితో తాము కూడా ఎంతో కొంత ఆర్థిక సహకారం అందిస్తున్నామని తెలుపుతూ వారి సేవలను కొనియాడారు. క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు చేకూరి సూరిబాబు రాజు, సెక్రటరీ డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, క్షత్రియ సంఘం వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి వెంకటేశ్వర వర్మ, చెరుకూరి రామలింగరాజు, వి.ఐవ్వ వెంకటరామ రాజు, క్లబ్ సెక్రటరీ వెంకటపతి రాజు, కె.వెంకటపతి వర్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగాల కోసం సెల్: 83339 88814

ప్రత్యేక జీవనశైలితోనే పరిపూర్ణ ఆరోగ్యం

పలుచోట్ల ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

కాళ్లలో అవగాహనా ర్యాలీ

కాళ్ల : నేటి సమాజంలో ప్రజలు ప్రత్యేకమైన జీవనశైలితో ఆరోగ్యకరమైన ఆహారాన్ని స్వీకరిస్తూ వ్యాయామం, శారీరక శ్రమ చేస్తే పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సరాబు సునీల్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ర్యాలీ సోమవారం నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, ఇందుకోసం తమ దయనందిన జీవితంలో ఆహార నియమాలు, పౌష్టికాహారం తీసుకోవడం, శరీరానికి తగిన శ్రమ, వ్యాయామం ఇవ్వడం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ డి.సునీత, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

గణపవరం : ఆరోగ్యంపట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యమైన జీవితం ఆశాజనక భవిష్యత్తుని అందిస్తుందని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక పిహెచ్‌సి సిబ్బంది ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, పబ్లిక్ హెల్త్ నర్స్ సిహెచ్.వెంకట సత్యవతి, హెల్త్ విజిటర్ సిహెచ్.పద్మజ పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ నియమ నిష్టలతో ఉంటే నిండు నూరేళ్లు జీవించవచ్చునని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.గోవింద్ బాబు అన్నారు. సోమవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించి రోగులకు మంచినీటి కుజాలు, విసనకర్రలు, గుడ్డ సంచులను పంపిణీ చేశారు. గోవింద్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ కాలుష్యం వల్ల అంతుపట్టని రోగాలు వస్తున్నాయని, నిరంతరం ఆరోగ్య రక్షణపై దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాంతకమని అన్నారు. న్యాయవాది సూరిశెట్టి కల్పన, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం 42 మంది రోగులకు మంచినీటి కుజాలు, విసనకర్రలు, గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌కె.చాన్ భాషా పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్, ఆకాశం హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో హృదయ సంబంధిత వ్యాధులపై అవగాహన, నడక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ ప్రారంభించారు. దుర్గా క్లాత్ షోరూమ్ నుంచి ఎస్‌వి.రంగారావు విగ్రహం వరకు వాక్ నిర్వహించారు. శశి కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి యూనిట్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాధవరం గ్రామంలో పిహెచ్‌సి ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆరోగ్యకరమైన ఆరంభం-ఆశాజనక భవిష్యత్తు అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ జి.వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ సిహెచ్‌వి.మణి, ఎస్.అశోక్ బాబు పాల్గొన్నారు.

తణుకు : ప్రజలు శారీరక, మానసిక ఒత్తిడితో అనారోగ్యం పాలౌతున్నారని సీనియర్ న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర న్యాయసేవల సంస్థ గుంటూరు వారి ఉత్తర్వుల మేరకు చైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాలతో సోమవారం పట్టణ పిహెచ్‌సిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి గాలి, నీరు కాలుష్యానికి గురౌతున్నాయని, వాటిని సేవించుట వల్ల మనం అనారోగ్యాలకు గురౌతున్నామని తెలిపారు. డాక్టర్లు రాజా నాగభూషణం, ఎన్.దానియేలురాజు, పృధ్వీరాజ్, మలేరియా డిపార్టుమెంట్ అధికారి వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ పి.సునీత పాల్గొన్నారు.


తణుకులో వైద్యులను సత్కరిస్తున్న నిర్వాహకులు

సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక హాలో స్కిన్ హాస్పిటల్ ప్రాంగణంలో వైద్య నిపుణులైన డాక్టర్ గుత్తుల బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ సీలం అశ్వనీకుమార్, చర్మవ్యాధుల నిపుణులు పుచ్చల శ్రావ్యకృష్ణను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కోడూరి చంద్రహాసవర్మ, వరిగేటి రాజు, కోడూరి రామకుమారవర్మ, రమ్య పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

పాలకొల్లు : స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యంపై పలు సూచనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి మాట్లాడుతూ 1948లో ప్రపంచ ఆరోగ్య సంస్థ స్థాపించిన రోజును వరల్డ్ హెల్త్ డేగా జరుపుకుంటామని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రామకృష్ణ, బోటనీ విభాగాధిపతి పి.శ్రీనివాసరావు, హెల్త్ కేర్ కన్వీనర్ కుమారి పి.జ్యోత్స్నశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సిలో డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. గీతాబాయి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనకమైన భవిష్యత్తుతో ప్రతి ఒక్కరూ కూడా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఆర్‌డిఒ దాసిరాజు మాట్లాడుతూ మదర్ థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ వైద్య సేవలు అందించాలని సిబ్బందికి తెలియజేశారు. తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, డాక్టర్ ఎం.నవ్య జీవన్, డాక్టర్ భావన, డాక్టర్ క్రాంతి, గుడాల హరిబాబు, గ్రామ సర్పంచి చొప్పల రజిని, దగ్గులూరు సర్పంచి కనకబద్రం, పెన్మత్స సాయిరాజు, రోటరీ అధ్యక్షులు రావాడ సతీష్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం వద్ద ప్రయాణీకులు

మార్టేరు సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రం

నిత్యం 50 కేజీల పెరుగు వినియోగం

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు, వెలగలేరు, సత్యవరం, నెగ్గిపూడి, శివారు వనంపల్లి పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం నిర్వహణలో మార్టేరు నాలుగు రోడ్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వేసవి మజ్జిగ చలివేంద్రం బాటసారుల దాహాన్ని తీరుస్తోంది. గడచిన 15 ఏండ్ల కిందట 2010 వేసవిలో ప్రారంభం అయిన ఈ చలివేంద్రం కరోనా కాలంలో సైతం బాటసారులకు, పోలీసులకు, ఆరోగ్య కార్యకర్తలకు, వైద్య-ఆరోగ్య శాఖ సిబ్బందికి, పారిశుధ్య సేవకులకు సేవలు అందించింది. ఈఏడాది ఉగాది రోజు ప్రారంభమైన ఈ చలివేంద్రం సుమారు 75 రోజులు నిరంతరాయంగా సేవలు అందిస్తుందని, సోమవారం సత్తిబాబు రెడ్డి వితరణతో చల్లని చెరుకు రసం పంపిణీ చేశామని స్థానిక చలివేంద్రం ప్రతినిధులు కెకెఆర్.చంద్రశేఖర రెడ్డి(ఆచారి), సిహెచ్‌డి.వీర నారాయణ రెడ్డి తెలిపారు. పాలకొల్లు నుంచి తణుకు వెళ్లే ఆటోలు, మిని వ్యాన్, క్యాబ్ డ్రైవర్లు, ప్రయాణీకులు ఇక్కడ ఆగి దాహం తీర్చుకోవడం ప్రతీ రోజు ఇక్కడ జరుగుతుందని స్థానికులు తెలిపారు.

మానవత ఆధ్వర్యాన చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం : ఎంఎల్ఎ

తణుకు : వేసవిలో దాహార్తిని తీర్చే విధంగా తణుకు మానవత ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం నరేంద్ర కాంప్లెక్స్ ఎదురుగా నూలి వారి ఇంటి ముందు ఎంఎల్ఎ రాధాకృష్ణ చలివేంద్రం ప్రారంభించారు. ఈ చలివేంద్రానికి దాత చిట్టూరి సుజాత వారి భర్త చిట్టూరి అచ్యుతరాంప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా రూ.10 వేలు విరాళంగా అందజేశారు. అదేవిధంగా రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారస్తులకి రూ.25లు విలువచేసే 25 గొడుగులను ఎంఎల్ఎ చేతుల మీదుగా అందజేశారు. తణుకు మహిళా కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఆవుల సంధ్యకు రూ.10 వేలు చిట్టూరి సుజాత, నందిగం సుధాకర్ రూ.6 వేలు కలిపి మొత్తం రూ.16 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తణుకులో జిరాక్స్ షాపు నడుపుకొంటున్న ముళ్లపూడి విజయలక్ష్మికి జిరాక్స్ మిషన్ మరమ్మత్తుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. తణుకు జిల్లా ఆసుపత్రిలో సుమారు 200 మంది రోగులకు బ్రెడ్, అరటిపళ్లు అందజేశారు. మండల అధ్యక్షులు కటారి శారదాదేవి, జిల్లా శాంతి ర్యాలీ కమిటీ ఛైర్మెన్ గమిని రాంబాబు, రాష్ట్ర విస్తరణ, అభివృద్ధి కమిటీ ఛైర్‌పర్సన్ డా.కోడూరి రాధాపుష్పావతి ప్రతిభా పురస్కారాల కమిటీ ఛైర్‌పర్సన్ బోయపాటి రామలక్ష్మీ, ఛైర్మెన్ రామకృష్ణ పాల్గొన్నారు. **పాలకొల్లు రూరల్** : మండలంలోని వాలమురు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గ్రామ సర్పంచి గంటా సత్యనారాయణ ప్రారంభించారు. ప్రతి సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎండలు అధికంగా ఉన్నాయి. వేసవిలో వాహనదారులు, బాటసారులు ఎండ తీవ్రతకు గురై ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని సర్పంచి గంటా సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సిహెచ్.మధుబాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సగం చెరువులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పాలకొల్లు రూరల్: మండలంలోని సగం చెరువు గ్రామంలో 60 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూటమి నాయకులు ప్రారంభించారు. గ్రామంలో విద్యుత్తు వోల్టేజీ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో నాయకుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. దీంతో ఎన్నికలకు ముందు మంత్రి రామనాయుడు ఇచ్చిన హామీ మేరకు కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎడిఇ రామకృష్ణ, ఎఇ శ్రీనివాస్, ఎంపిటిసి మామిడి శెట్టి లలిత కుమారి, టిడిపి మండల అధ్యక్షులు కోడి విజయభాస్కర్, చల్లబోయిన సహదేవుడు, శీలం అశోక్, శీలం వరప్రసాద్ కడలి నాగమణి పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

ఉండి : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని ఉండి తహశీల్దార్‌కు గ్రామ రెవెన్యూ సహాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్ర కమిటీ గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం కోసం దశలవారి ఆందోళనకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. తహశీల్దార్‌లకు, ఆర్‌డిఒలకు, మంత్రులు, ఎంఎల్ఎలకు వినతి పత్రాలు ఇవ్వడం మొదటి దశ, రెండవ దశలో కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని, మూడవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు ఉంటాయని తెలియజేశారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు, గణేష్, శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండాలి

వండర్ కిడ్స్ స్కూల్ వార్షికోత్సవంలో ఆదిత్య కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ రావు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న యాజమాన్యం

భీమవరం టౌన్ : విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని, సెల్ ఫోన్స్‌కు దూరంగా ఉండాలని భీమవరం ఆదిత్య కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస రావు అన్నారు. సోమవారం భీమవరం మెంటేవారితోటలో వండర్ కిడ్స్ స్కూల్ 31వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ సెల్ ఫోన్స్ ఎక్కువగా ఉపయోగించడం వల్ల మతిమరుపు పెరుగుతుందని, నేటి విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. అనంతరం ఆయన్ని సత్కరించారు. ఉమెన్ అండ్ చైల్డ్ వేల్ఫేర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మీకాంతం, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. స్కూల్ ఛైర్మన్ అల్లు రామకృష్ణ, వనజాక్షి, మేనేజింగ్ డైరెక్టర్ అల్లు వంశీకృష్ణ మాట్లాడుతూ మొదట 24 మంది విద్యార్థులతో ప్రారంభించిన వండర్ కిడ్స్ నేడు దినదినాభివృద్ధి సాధించిందన్నారు. పట్టుదలతో విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలు విభాగాల్లోని విజేతలకు బహుమతులు అందించారు.

గ్రామాలాభివృద్ధికి నేడు అడుగులు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎంఎల్ఎ అంజిబాబు, మాజీ ఎంపీ సీతారామలక్ష్మి

భీమవరం టౌన్ : రాష్ట్రంలో గత ఐదేళ్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామాల అభివృద్ధికి నేడు అడుగులు పడ్డాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సోమవారం భీమవరం మండలం యనమదుర్రు, దిరుసుమర్రు, దెయ్యాలతిప్ప గ్రామాల్లో పలు సీసీ రోడ్లను ఎంఎల్ఎ అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. యనమదుర్రు గ్రామంలో రూ.9 లక్షలు, దిరుసుమర్రు గ్రామంలో రూ.కోటి 20 లక్షలు, దెయ్యాలతిప్ప గ్రామంలో రూ.25 లక్షల నిధులతో సీసీ రోడ్లను ప్రారంభించారు. అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్లనే వేయిస్తామని, బీటీ రోడ్లు వద్దని కూడా ఇటీవలే అసెంబ్లీలో సిఎం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. కోట్లాది రూపాయలతో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని, గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని, సూపర్ సిక్స్ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని అన్నారు. వచ్చేనెలలో తల్లికి వందనం పథకం కూడా అమలు చేస్తున్నామని, పింఛన్లు రూ.4 వేలు చేసి ఒకటో తేదీన అందజేస్తున్నామని ఎంఎల్ఎ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన మండల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ సర్పంచిలు పాల్గొన్నారు.

తలతాడితిప్పలో జ్వర పీడితులు

ఆసుపత్రిలో పలువురు

వీరవాసరం : వీరవాసరం పంచాయతీ పరిధిలోని తలతాడి తిప్ప గ్రామంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురైన పలువురిని సర్పంచి చికిలే మంగతాయారు, ఎంపిపి వీరవల్లి దుర్గ భవాని చంద్రశేఖర్, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు సోమవారం పరామర్శించారు. గ్రామంలో మార్చి 28 తేదీ నుంచి పలువురు అనారోగ్యానికి గురై ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న సర్పంచి మంగతాయారు కార్యదర్శి లక్ష్మి గ్రామంలో అపారిశుధ్య చర్యలను చేపట్టారు. వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇంటింటికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. డెంగీ జ్వరాన్ని నిర్ధారించే మూడు పరీక్షలలో ఎవరికి పాజిటివ్ రాలేదని, ఒక పరీక్షలో ఒకరికి పాజిటివ్ వచ్చిందని, కావున జ్వరానికి లోనైన వారు డెంగీ జ్వరం సోకినట్టుగా నిర్ధారణ కాలేదని వైద్య సిబ్బంది తెలిపారు. గ్రామంలో మొత్తం 11 మంది జ్వరాల బారిన పడితే వారిలో ఆరుగురు డిశ్చార్జ్ అయ్యారన్నారు. వీరందరికీ తెల్ల రక్త కణాలు తగ్గినట్టుగా వైద్య పరీక్షలలో నిర్ధారించినట్లు రోగులు తెలిపారన్నారు. గ్రామంలో నెలకొన్న అనారోగ్య పరిస్థితులపై ఆరా తీసిన ప్రజాప్రతినిధుల బృందం గ్రామస్తులకు భరోసా కల్పించారు. ఎవరూ అధైర్యపడొద్దని అనారోగ్య సూచనలు ఉన్నట్టు తెలిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యులను కలిసి వారి అనారోగ్య పరిస్థితులను నిర్ధారించుకోవాలని సూచించారు. అవసరమైతే అదనపు వైద్య పరీక్షలకు వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి వీరవల్లి శ్రీనివాసరావు, యాల మోహన్, ఆశాలు ఉన్నారు.

24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో ఎంఎల్ఎలు రాధాకృష్ణ, నాయకర్


తణుకురూరల్ : జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

తణుకు రూరల్ : రైతులు తాము విక్రయించిన ధాన్యానికి 24 గంటల వ్యవధిలోనే డబ్బులు వారి ఖాతాల్లోకి జమ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. తణుకు మండలం దువ్వ, వేల్పూరు గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ తణుకు నియోజకవర్గంలో 53 రైతు సేవ కేంద్రాల ద్వారా దాదాపు 1.60 లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఆరు లక్షల టన్నులు, తణుకు నియోజవర్గంలో లక్ష టన్నుల చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా నిలబడుతుందన్నారు. రైతులు తమకు నచ్చిన ప్రాంతాల్లో ఏ రైస్ మిల్లుకు కావలిస్తే ఆ రైస్ మిల్లుకు అమ్ముకునే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా గోనె సంచుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మొగల్తూరు** : ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటలలో నగదు వారి ఖాతాలలో జమ చేస్తున్నామని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రైతులకు ఆరుతడి పంట విత్తనాలు, యంత్ర సామాగ్రి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రైతులను దగా చేసిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సొంత నిధులు ఒక్కొక్క రైతుకు లక్ష రూపాయలు చొప్పున 400 మంది రైతులకు అందించారని ఆయన తెలిపారు. అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ ట్రంప్ విధానాలతో ప్రపంచవ్యాప్తంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఆక్వా పరిశ్రమకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు ప్రగతి సాధించాలని ఆయన సూచించారు. వ్యవసాయ శాఖ అనిలాకుమారి, ఎఒ అబ్దుల్ రహీం, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, బోనం నరసింహారావు, పడవల సత్యనారాయణ, కొల్లాటి గోపి, దాసరి కృష్ణాజీ, నిప్పులేటి రామారావు ఉన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

భీమవరం : జిల్లాలో ఉన్న కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు కోరారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ గత సార్వా పంట సమయంలో అధిక వర్షాలకు జిల్లాలో 17 మండలాల్లో 135 గ్రామాల్లో 10 వేల 900 ఎకరాలు పైబడి పంటలు మునకకు గురై దెబ్బతిన్నాయని గుర్తుచేశారు. ఈ సమయంలో వ్యవసాయాధికారులు జిల్లాలో 8,729 మందికి రూ.9 కోట్ల 54 వేలు పంటనష్టం అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపారన్నారు. ప్రస్తుత వ్యవసాయంలో యంత్రాల ప్రవేశంతో పంట కోత, నూర్పిడి విధానంలో మార్పులు వచ్చాయని, ధాన్యం రాశి వేసేందుకు, ఆరబెట్టేందుకు, వాతావరణ పరిస్థితుల్లో పైన కప్పేందుకు ఒక ఎకరాకి 6 బరకాలు వరకు అవసరమవుతాయని, వీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కౌలు చట్టాన్ని మార్చి కౌలు రైతులందరికి భూయజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వకుండా పెట్టుబడి సాయం వేస్తే వాస్తవంగా పంటలు పండించే కౌలురైతులకు అన్యాయం జరుగుతుందన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నరసాపురం : మొగల్తూరు మండలం కేపీపాలెం నార్త్ గ్రామానికి చెందిన యాంద్ర కిరణ్ వెంకట్ అనే బాలుడు గత కొన్ని సంవత్సరాలుగా తలసేమియా అనే అరుదైన రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. తీవ్ర ఆర్థిక పరిస్థితుల మధ్య చికిత్స కొనసాగించలేని స్థితిలో ఉన్న ఆ బాలుడు ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ని ఆశ్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ స్పందించి వెంటనే ప్రభుత్వం దృష్టికి ఈ కేసును తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆపరేషన్‌కు అవసరమైన మొత్తానికి ఎల్ఒసి మంజూరు చేయించి, సోమవారం అందజేశారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

పెనుగొండ : మండలంలోని సిద్ధాంతం గ్రామంలోని శ్రీవివేకానంద స్వామి విగ్రహం వద్ద వంగూరి వెంకట సత్యనారాయణ, నల్ల విశ్వేశ్వరరావు, బొక్క సోమరాజు, లొల్లభట్టు శివ ఆర్థిక సహాయంతో సోమవారం సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశంలో బల్లలు ఏర్పాటు చేయడంతో స్థానికులు పాదాచారులు, రైతులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

మహారాజశ్రీ రామచంద్రపురం 13వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

D.O.P. No. 24/2024

Between:

మురా సురేష్ -పిటీషనర్

AND

మురా అనిత, W/o. సురేష్, C/o. మత్తే అమృతరావు, లూథరన్ చర్చ్ దగ్గర, ఎస్.సి.పేట, సీసలి గ్రామం, కాళ్ళ మండలం, పశ్చిమగోదావరి జిల్లా -రెస్పాండెంట్

నోటీసు

పై నెంబరు గల రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిమార్లు కోర్టు నోటీసులు పంపినను మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనుటలేదు. శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం యీ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయుచున్నాము. సదరు పై నెంబరు D.O.P. గ్రంథములో కోర్టు వాయిదా **ది. 11-04-2025 అయ్యి వున్నది.** కాబట్టి సదరు వాయిదా రోజున మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని **ఉదయం 10 గంటలకు** హాజరు అయి ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని పక్షమున మీపై పరోక్షమందు విచారించి తీర్మానం చేయబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వి.వెంకట్రావు

రామచంద్రపురం పిటిషనర్ తరపు అడ్వకేటు

07-04-25 ఆలమూరు, సెల్: 9989955116

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 247/2015

Between:

చంద్రు సుబ్బారావు ...వాది

Vs

గద్దె మంగరాజు వగైరా ...ప్రతివాది

ఈ నెంబరు దావాలో ఏడవ ప్రతివాది ఈడుపుగంటి వీర వెంకట లక్ష్మి భర్త: ప్రసాదరావు, కానూరు, ఉండ్రాజవరం మండలం అనువారు పై నెంబరు దావాలో కోర్టు ద్వారా ఎన్నిమార్లు దావా సమన్లు పంపినప్పటికీ తీసుకొననందున /evade చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు ఏడవ ప్రతివాది ఈడపుగంటి వీర వెంకట లక్ష్మి భర్త: ప్రసాదరావు, కానూరు, ఉండ్రాజవరం మండలం అనువారు పై నెంబరు దావాలో **ది. 09-04-2025వ తేదిన ఉదయం 10-30 ని॥లకు** పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడునని తెలియ పరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ధూళిపాళ సూర్య రామారావు

తాడేపల్లిగూడెం పిటిషనర్లు తరపు న్యాయవాది

తేది:06-04-2025 తాడేపల్లిగూడెం

ప్రకటన

In The Court Of The Principal Junior Civil Judge, Bhimavaram

O.S.No. 17/2025

Between:

Plaintiff: Union Bank of India, Bhimavaram Branch Rep by its Branch manager

Defendants:

1. Mis Sowjanya Centring Works Props Penumaka Sowjanya

2. Penumaka Sowjanya

పై నెంబరు దావాలో ప్రతివాదులకు ఎన్నిసార్లు సమన్లు పంపినను అవి అందుకోకుండా కాలయాపన చేయుచున్నారు. వాది తరుపున ప్రతివాదులపై శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. ప్రతివాదులు **ది. 21-04-2025వ తేదిన ఉదయం 10-30 ని॥లకు** కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియ జేయుచున్నాము.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

అల్తి శివరామకృష్ణ

భీమవరం అడ్వకేట్, శ్రీరాంపురం

తేది:08-04-2025 భీమవరం - 2

సెల్: 98484 60585